# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha
@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

ఆదివారం 20-8-2023




## సూర్యాపేటలో సీఎం కేసీఆర్..

**సూర్యాపేట, ఆగస్ట్20(తెలుగుప్రభ):**

సూర్యాపేట జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటిస్తున్నారు. నూతన కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ సముదాయాలు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ప్రారంభించారు. మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. నల్లగొండ వేదికగా సీఎం కేసీఆర్ ఎలాంటి ప్రకటన చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మరో వైపు సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో సూర్యాపేటలో సభా ఏర్పాట్లను మంత్రి జగదీష్ రెడ్డి పరిశీలించారు. అనంతరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి జగదీష్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి భోజన విరామం తీసుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. సాయంత్రం 4.50 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో హైదరాబాద్ బయల్దేరనున్నారు.

# ఇద్దరిలో ఎవరికిచ్చినా ఒకే కానీ..

### ఉప్పల్‌లో బీఆర్ఎస్ టికెట్ కోసం పోటీ
### ఎమ్మెల్సీ కవిత వద్దకు ఇద్దరు నేతలు

**హైదరాబాద్, ఆగస్ట్20(తెలుగుప్రభ):**

**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ కు ముందే వేడెక్కుతోంది. అధికార పార్టీ బీఆర్ఎస్ లో అయితే టికెట్ల జాబితా విడుదల వార్తలతో ఉత్కంఠ ఏర్పడింది. పలు నియోజక వర్గాల్లో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఉప్పల్‌లో ఇప్పటి వరకు ఉప్పు, నిప్పుగా ఉన్న ఇద్దరు నేతలు ఒక్కటయ్యారు. టికెట్ ఇద్దరిలో ఎవరికి ఇచ్చినా ఒకే కానీ.. వేరే వ్యక్తికి ఇవ్వొద్దని ఎమ్మెల్సీ కవితను కోరారు.**



ఉప్పల్‌లో బి.లక్ష్మా రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇస్తారనే ఊహాగానాలు బలంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక నేతలు, ప్రస్తుత ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఒక్కటయ్యారు. వీరిద్దరూ కలిసి ఎమ్మెల్సీ కవితను కలిశారు.ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, బొంతు రామ్మోహన్ తామిద్దరిలో ఒకరికి టికెట్ ఇచ్చేలా చూడాలని ఎమ్మెల్సీ కవితను కోరారు. వేరే వారికి టికెట్ ఇవ్వవద్దని కోరారు. అయితే, ఈ విషయాన్ని తాను అధిష్ఠానానికి తీసుకెళ్తానని కవిత హామీ ఇచ్చినట్లుగా సమాచారం. ఉప్పల్ లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇస్తే ఓటమి తప్పదని అభిప్రాయాలు రావడంతో మార్చాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదే నియోజకవర్గంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండారి లక్ష్మా రెడ్డి ఈసారి ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందని ధీమాగా ఉన్నారు. ప్రతి రోజు వివిధ కాలనీల్లో సందర్శిస్తూ వారి మద్దతును కూడగట్టుకుంటున్నారు.

**వరుసగా గెలిచిందే లే..**

2009లో ఏర్పడిన ఉప్పల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి కూడా వరుసగా గెలవలేదు. 2009లో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థి బండారి రాజిరెడ్డి విజయం సాధించగా, 2014 లో బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ గెలిచారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి భేతి సుభాష్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఉప్పల్ బరిలో దిగేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డితో పాటు జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సోదరుడు బి. లక్ష్మా రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ భర్త మోతె శోభన్ రెడ్డి కూడా పోటీలో ఉన్నారు.

## 39 మందితో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ..
## రేవంత్‌రెడ్డికి రిక్త'హస్తం'

**న్యూఢిల్లీ, ఆగస్ట్20(తెలుగుప్రభ):**



కాంగ్రెస్ వర్కింగ్ కొత్త కమిటీని ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. ఆగస్టు 20న భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాజీవ్‌గాంధీ జయంతి కావడంతో.. అదే రోజు ఖర్గే వర్కింగ్ కమిటీని పునరుద్ధరించారు. ఈ కమిటీలో కొత్తగా పార్టీ సీనియర్ నేతలైన సచిన్ పైలట్, శశిథరూర్, ఆనంద్ శర్మ, ఏపీకి చెందిన సీనియర్ నేత ఎన్ రఘువీరారెడ్డి, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జీత్ సింగ్ చన్నీ తదితరులకు చోటు కల్పించారు. పైన పేర్కొన్న నాయకులేగాక నజీర్ హుస్సేన్, అల్కా లాంబా, సుప్రియా శ్రీనాథే, ప్రణీతి షిండే, పవన్ ఖేరా, గణేశ్ గొడియాల్, యశోమతి ఠాకూర్ పేర్లను కూడా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుల జాబితాలో చేర్చారు. సీనియర్ నాయకులు వీరప్ప మొయిలీ, మనీశ్ తివారీల పేర్లు ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో ఉన్నాయి. కాగా, మొత్తం 39 మంది సభ్యులతో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏర్పాటైంది. ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీకి చెందిన పల్లంరాజును, తెలంగాణ నుంచి వంశీచంద్ రెడ్డిని ఖర్గే నియమించారు. శాశ్వత ఆహ్వానితులుగా బీ సుబ్బిరామిరెడ్డి, కొప్పుల రాజులకు అవకాశం కల్పించింది. తెలంగాణ నుంచి ఈ జాబితాలో మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహకు చోటు దక్కింది. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి ఈ జాబితాలో చోటు దక్కలేదు.

## కర్ణాటకలో కుప్పకూలిన డ్రోన్..

**బెంగళూరు, ఆగస్ట్20(తెలుగుప్రభ):**

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగానికి (డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌కు) సంబంధించిన డ్రోన్ ఆదివారం ఉదయం కుప్పకూలింది. కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రోన్‌పై TAPAS-07A-14 నంబర్ ఉంది. ఒక్కసారిగా పంట పొలాల్లో డ్రోన్ కుప్పకూలడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, డీఆర్‌డీవో అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ ఘటనలో డ్రోన్ పూర్తిగా ధ్వంసమైంది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు.



## మేం మంచి స్నేహితులం..

**లక్నో, ఆగస్ట్20(తెలుగుప్రభ):**


తమిళసూపర్ స్టార్ రజినీకాంత్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో సమావేశమయ్యారు. ఆదివారం ఉదయాన్నే అఖిలేష్ నివాసానికి వెళ్లిన రజినీకాంత్‌ను ఆయన సాదరంగా స్వాగతించారు. ఆ తర్వాత ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్నారు. అనంతరం అఖిలేష్ నివాసం నుంచి బయటికి వచ్చిన రజినీకాంత్ మీడియాతో మాట్లాడారు. అఖిలేష్ యాదవ్‌ను తాను తొమ్మిదేళ్ల క్రితం ముంబైలో జరిగిన ఓ ఫంక్షన్‌లో కలిశానని, అప్పటి నుంచి తామిద్దరం స్నేహితులమయ్యామని రజినీ చెప్పారు. ఇద్దరం తరచూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని అన్నారు. ఐదేళ్ల క్రితం కూడా తాను ఓ సినిమా షూటింగ్ కోసం లక్నోకు వచ్చానని, కానీ అతను లక్నోలో లేకపోవడంతో కలవలేకపోయానని అన్నారు. ఇప్పుడు ఆయన లక్నోలోనే ఉన్నాడని తెలుసుకుని కలిశానని చెప్పారు.



## మాజీ ఎమ్మెల్యే రాసలీలలు..

**ఖమ్మం, ఆగస్ట్20(తెలుగుప్రభ):**

ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మదన్‌లాల్ ఓ మహిళతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహిళకు ముద్దు పెడుతూ ఫోటోలో కనిపించడంతో బీఆర్ఎస్‌లో హాట్ టాపిక్ మారింది. ఇదంతా ఎమ్మెల్యే రాములు నాయక్ వర్గం కుట్ర అని.. ఫోటోలు మార్ఫింగ్ చేశారని మదన్ లాల్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. మదన్‌లాల్ కుమారుడు మృగేందర్ లాల్ కూడా గతంలో ఓ యువతిపై అత్యాచారం చేశారని ఆరోపణలు ఉన్నాయి. మదన్‌లాల్ 2014లో వైఎస్ఆర్‌సీపీ నుంచి వైరా ఎమ్మెల్యేగా గెలుపొందారు.



## ఆడపిల్లల చదువుకు ఎమ్మెల్సీ కవిత కుమారుల చేయూత

**హైదరాబాద్, ఆగస్ట్20(తెలుగుప్రభ):**

ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కుమారులు ఆదిత్య, ఆర్యా చిన్న వయస్సులోనే పెద్ద మనస్సును చాటుకున్నారు. సమాజ సేవ కోసం ఇటీవల ఆదిత్య, ఆర్యా కలిసి మొదలుపెట్టిన సినర్జీ ఆఫ్ మైండ్స్ ఫౌండేషన్ ద్వారా ఆడబిడ్డల చదువుకు చేయూతనిచ్చారు. హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కాలేజీలో అడ్మిషన్ పొందినవారిలో ఆర్థికంగా వెనుకబడిన 10 మంది మహిళా విద్యార్థులకు ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్‌లను అందజేశారు. వారిలో ఆరుగురు డిగ్రీ, ముగ్గురు పీజీ విద్యార్థినులు ఉన్నారు. ఎమ్మెల్సీ కవిత, కాలేజీ ప్రతినిధుల సమక్షంలో విద్యార్థులకు ఆదిత్యా, ఆర్యా స్కాలర్‌షిప్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు తాము ఎప్పుడూ మద్దతిస్తాని తెలిపారు. తన కుమారులు ఇద్దరు సమాజసేవ కోసం ఫౌండేషన్‌ను స్థాపించి విద్యార్థులకు చేయుతనందించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న వయస్సుల్లోనే వాళ్లు గొప్పగా ఆలోచించడం తల్లిగా తనకు గర్వంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులోనూ ఫౌండేషన్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. స్కాలనఖషిప్ అందుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. చదువులో బాగా రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.




## పార్టీ మారనున్న ఉత్తమ్!

### ఆ ప్రచారం నమ్మొద్దు.. ఉత్తమ్ కుమార్ రెడ్డి..

**హైదరాబాద్, ఆగస్ట్20(తెలుగుప్రభ):**



టీపీసీసీ మాజీ చీఫ్, ఎంపీ ఉత్తమ్ కుమారెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఆయన, ఆయన భార్య బీఆర్ఎస్ గానీ, బీజేపీలోకి గానీ వెళ్లేందుకు సిద్ధమయ్యారంటూ పుకార్లు షికారు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా పార్టీ మార్పు వ్యవహారంపై క్లారిటీ ఇచ్చారు. ఓ వీడియోను విడుదల చేసిన ఉత్తమ్.. పార్టీ మార్పు వార్తలను ఖండించారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడే ముచ్చటే లేదని తేల్చి చెప్పారు.

తాజాగా టీపీసీసీ మాజీ చీఫ్, ఎంపీ ఉత్తమ్ కుమారెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఆయన, ఆయన భార్య బీఆర్ఎస్ గానీ, బీజేపీలోకి గానీ వెళ్లేందుకు సిద్ధమయ్యారంటూ పుకార్లు షికారు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా పార్టీ మార్పు వ్యవహారంపై క్లారిటీ ఇచ్చారు. ఓ వీడియోను విడుదల చేసిన ఉత్తమ్.. పార్టీ మార్పు వార్తలను ఖండించారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడే ముచ్చటే లేదని తేల్చి చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను హుజూర్ నగర్ నుంచి, తన భార్య పద్మావతి కోదాడ నుంచి పోటీలో ఉంటామని స్పష్టమైన ప్రకటన చేశారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను కార్యకర్తలు ఎవరూ నమ్మొద్దని రిక్వెస్ట్ చేశారు ఉత్తమ్.

## వృద్ధ దంపతుల ఆత్మహత్య

### రాజన్న సిరిసిల్లలో విషాదం

**రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్20(తెలుగుప్రభ):**

రాజన్న సిరిసిల్లలో విషాదం నెలకొని ఉంది. వృద్ధ దంపతుల ఆత్మహత్య కలకలం రేపుతుంది. జిల్లాలోని చందుర్తి మండలం అశిరెడ్డి పల్లె గ్రామంలో కనికపరపు దేవయ్య, లక్ష్మి దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య (Suicide) చేసుకున్నారు.గ్రామస్తులు, పోలీసులు తెలిపన వివరాల ప్రకారం .. ఆస్తి పంపకాల విషయంలో కొంతకాలంగా కొడుకులతో విభేదాలున్నాయని తెలిపారు. వారి వేధింపులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం దంపతులు ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు గమనించి వేములవాడ ఏరియా ఆసుపత్రి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందారని వారిని పరీక్షించిన వైద్యులు నిర్ధారించారు.

